క్లుప్తంగా

సద్దుల బతుకమ్మ ఏర్పాట్ల పరిశీలన



సాకి చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: ఈనెల 10వ తేదీన పటానచెరు డివిజన్ పరిధిలోని సాకి చెరువు కట్టపై నిర్వహించబోయే బతుకమ్మ సంబరాల ఏర్పాట్లను శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పరిశీలించారు. ప్రధానంగా బతుకమ్మ ఘాట్ వద్ద మహిళల సంఖ్యకు అనుగుణంగా సిబ్బందిని అందుబాటులో ఉంచాలని జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్, ఏఎంసీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు



అక్రమ నిర్మాణాలకు నోటీసులు జారీ చేస్తున్న దృశ్యం

పటాన్‌చెరు టౌన్: గ్రామపంచాయతీ నుంచి తీసుకున్న అనుమతుల మేరకు మాత్రమే నిర్మాణాలు చేపట్టాలని అలాకాకుండా ఇష్టారాజ్యంగా చేపడితే కఠిన చర్యలు ఉంటాయని ఇంద్రేశం గ్రామ కార్యదర్శి సుభాష్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఇంద్రేశంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్న ఎనిమిది భవనాలను గుర్తించి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నోటీసులు జారీ చేసినా పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడితే కూల్చివేతలు చేపడతామని హెచ్చరించారు.

వ్యక్తి అదృశ్యం

జహీరాబాద్ టౌన్: మండలంలోని హుగ్గెల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు రూరల్ ఎస్ఐ. ప్రసాద్‌రావు తెలిపారు. హుగ్గెల్లికి చెందిన జమీర్ బేగ్ ఆరోగ్యం దెబ్బతినడంతో ఇంటి వద్దనే ఉంటున్నాడు. సెప్టెంబర్ 27న ఇంటి నుంచి బయటకు వెళ్లిన జమీర్ ఇంటికి తిరిగిరాలేదు. ఆయన కోసం గాలించిన ఆచూకీ లభించలేదు. దీంతో భార్య ఇతియాబేగం ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

కార్మికుల సంక్షేమ కోసం నిరంతరం పోరాటం



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మల్లేశం

జహీరాబాద్ టౌన్: కార్మికుల సంక్షేమ కోసం సీఐటీయూ నిరంతరం పోరాటం చేస్తోందని జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేశం అన్నారు. బూచినెల్లి పరిధిలో గల సీఐఈ ఆటో మోటివ్ పరిశ్రమలో ఈ నెల 5న కార్మిక యూనియన్ ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడుతూ అత్యధిక పరిశ్రమల్లో సీఐటీయూ మెరుగైన వేతన ఒప్పందానికి కృషి చేసిందన్నారు.

ఎఫ్‌టీఎల్ నిర్మాణాల పరిశీలన

వట్‌పల్లి(అందోల్): అందోల్ మండలం అల్మాయిపేట శివారులోని ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టారంటూ వచ్చిన ఫిర్యాదుపై కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా అదనపు ట్రైనీ కలెక్టర్ మనోజ్ స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. శివారులో నిర్మించిన పౌల్ట్రీ ఫామ్‌ను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా నిర్మాణాలు చేపట్టారంటూ వచ్చిన ఫిర్యాదు మేరకు చెరువు పరిధి, విస్తీర్ణం, పౌల్ట్రీ నిర్మాణాల పరిధిని పరిశీలించామని చెప్పారు. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ మధుకర్ రెడ్డి, ఎంపీడీవో రాజేష్ కుమార్, ఎంపీవో అశోక్ కుమార్, ఇరిగేషన్ ఏఈ మజర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సర్వేయర్ మురళీధర్‌లు ఉన్నారు.



న్యాల్‌కల్(జహీరాబాద్): గాయత్రీ దేవిగా..



రాయికోడ్(అందోల్): రాజరాజేశ్వరిదేవిగా..



నారాయణఖేడ్: గాయత్రీ దేవిగా నల్లపోచమ్మ



కల్హేర్: బాలాత్రిపుర సుందరి దేవిగా..

దుర్గామాత నమోస్తుతే

జిల్లా వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రులు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో ప్రతిష్ఠించిన అమ్మవార్లకు శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలతో పాటు కుంకుమార్చన నిర్వహించారు. రెండోరోజు ఆలయాల్లో అమ్మవారిని బ్రహ్మచారిణిఅవతారంలో అలంకరించి ప్రత్యేక పూజలను చేశారు.



నారాయణఖేడ్: దుర్గామాతను దర్శించుకుంటున్న ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి



ఝరాసంగం(జహీరాబాద్): గాయత్రీ దేవి అలంకరణలో దుర్గామాత

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని వినతి

సంగారెడ్డి టౌన్ : సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని పంచాయతీ రాజ్ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నరసింహులు, ప్రధాన కార్యదర్శి రాహుల్ అన్నారు. శుక్రవారం పట్టణానికి విచ్చేసిన ఎమ్మెల్సీ కోదండరాంకు వినతి పత్రాన్ని అందజేశారు. ఓపీఎస్ ను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం ముందుకు రావాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే చెల్లించేందుకు కృషి చేయాలన్నారు.

డిజిటల్ కార్డుల సర్వే తనిఖీ

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డుకు సంబంధించిన మంగల్‌పేట్‌లో ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వే కొనసాగుతోంది. ఆర్డీఓ అశోకచక్రవర్తి, మున్సిపల్ కమిషనరు జగ్జీవన్, తహసీల్దారు భాస్కర్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్ శుక్రవారం సందర్శించి తనిఖీ చేసి పరిశీలించారు. పలు ఇళ్లకు తిరిగి వివరాలను సేకరిస్తున్న తీరును చూశారు. సర్వే చేస్తున్న సిబ్బందికి పలుసూచనలు సలహాలు ఇచ్చారు. ప్రజలు సర్వే సిబ్బంది అడిగిన వివరాలు తెలుపుతూ సర్వేకు సహకరించాలని సూచించారు. వారివెంట కౌన్సిలర్ వివేకానంద్ ఉన్నారు.

గునుగుపూలకు కేరాఫ్ అడ్రస్ ఖేడ్

- మెదక్, జోగిపేట, కామారెడ్డి ప్రాంతాలకు తరలింపు
- ఇక్కడే లభిస్తున్న పూలు
- పత్తి, వరి కారణంగా ఇతర ప్రాంతాల్లో కొరత



ద్విచక్ర వాహనాల ద్వారా తరలిస్తున్న గునుగుపూలు

నారాయణఖేడ్: బతుకమ్మ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. వీటిని పేర్చడంలో గునుగుపూలదే ప్రత్యేకం. ప్రధానంగా ఈ పూల మొక్కలను ప్రత్యేకంగా సాగుచేసే, విత్తనాలు విత్తే అవసరం లేకున్నా బీడుభూములు, చేల ఒడ్డు పక్కన.. కంది, పెసర, మినుము, జొన్న తదితర పంటల్లో కలుపు మొక్కలతో కలిసి పెరుగుతుంటాయి. ఖేడ్ ప్రాంతంలో సాగునీటి వనరులు తక్కువగా ఉండటం, ఈ ప్రాంతం వర్షాధార పంటలైన పప్పు దినుసు పంటలకు పేరుగాంచింది. దీంతో ఈ ప్రాంతంలో దినుసు పంటల్లో గునుగుపూల మొక్కలు ఎక్కడ చూసినా కనిపిస్తుంటాయి.

జిల్లాతోపాటు పొరుగున ఉన్న కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో వరి, పత్తి పంటల సాగు ఎక్కువ. కానీ పత్తికి కలుపు తీయడం, క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తుండటం వల్ల ఆయా ప్రాంతాల్లో గునుగుపూల మొక్కలు మొలిచే పరిస్థితి లేదు. దీంతో ఏటా బతుకమ్మ సంబురాల్లో భాగంగా వారం రోజులపాటు వేలాది వాహనాల్లో ఈ ప్రాంతానికి వచ్చి పూలను తెంచుకుని ఆయా చోట్లకు తరలిస్తుంటారు. ఈసారి అత్యంత అధిక ఎక్కువ సంఖ్యలో తరలిస్తున్నారు. శుక్రవారం చూస్తే దాదాపు 2 వేల ద్విచక్రవాహనాలు, ట్రాక్టర్లు, ఆటోలు, డీసీఎం వ్యాన్లలో జోగిపేట, మెదక్ జిల్లా .. పెద్దశంకరంపేట, అల్లాదుర్గం, టేక్మాలు, పాపన్నపేట, మెదక్, కామారెడ్డి జిల్లా.. పిట్లం, నిజాంసాగర్, నిజామాబాద్ జిల్లా.. బాన్సువాడ తదితర ప్రాంతాలకు పూలను తరలించారు. తరలించే క్రమంలో అల్పాహారం, భోజనాలు, టీలు తాగడానికి ఆగుతారు. దీంతో ఈ ప్రాంతంలోని ఏ హోటల్ ఎదుట చూసినా పదుల సంఖ్యలో ఈ పూలను తరలిస్తున్న వాహనాలే కనిపిస్తున్నాయి. ఖేడ్ ప్రాంతంలో సంప్రదాయ పంటల సాగుగా పప్పు దినుసు సాగు జరగడం వల్ల ఇక్కడైనా లభిస్తున్నాయి. ప్రాంతం నుంచి ఈ వాహనాలు భారీ సంఖ్యలో వెళ్తుండటంతో జనాలు ఆసక్తిగా తిలకిస్తున్నారు.



ట్రాక్టరులో తరలిస్తున్న గునుగుపూలు

రైతులను ఆదుకునేందుకు సర్కారు సిద్ధం

- ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి



సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు సిద్ధంగా ఉందని, తమ పంట ఉత్పత్తులను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు విక్రయించాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి సూచించారు. మనూరు మండల కేంద్రంలోని గోడౌన్‌లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు సంక్షేమం కోసమే ప్రభుత్వ ఆలోచిస్తుందని అన్నారు. అందుకు అనుగుణంగా పంట ఉత్పత్తుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతీ రైతుకు అండగా ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు దిగంబర్‌రెడ్డి, అశోక్ పాటిల్, సిద్ధారెడ్డి, రాజు, శ్రీకాంత్ రెడ్డి, శివాజీపాటిల్, శంకర్ ముదిరాజ్, ఏడీఏ నూతన్‌కుమార్, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రం అయ్యేనా ?

- తుల్జాభవాని ఆలయంలో దసరా ఉత్సవాలు ప్రారంభం



తుల్జా భవాని మాత

జహీరాబాద్ టౌన్: మహారాష్ట్రలోని తుల్జాపూర్ భవాని మాత ఆలయం గొప్ప ప్రసిద్ధి. అంతటి చరిత్ర కలిగిన ఆలయం జహీరాబాద్ నియోజకవర్గం మొగుడంపల్లి మండలం ఖంజమన్‌పూర్(భవానమ్మపల్లి)లోనూ ఉంది. తుల్జా భవాని మాత మందిరాన్ని ఛత్రపతి శివాజీ నిర్మించారని చరిత్ర చెబుతుంది. అమ్మవారి ఆలయానికి నిత్యం భక్తులు వస్తుంటారు. దేవి శరన్న నవరాత్రి సందర్భంగా దసరా పండుగ వరకు ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. భవాని మాత ఆలయంలో ఉత్సవాలు ప్రారంభం కాగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివస్తున్నారు.

ఖంజమల్‌పూర్‌లోని తుల్జాపూర్ భవాని మాత ఆలయం 500 సంవత్సరాల క్రితం ఛత్రపతి శివాజీ స్వయంగా నిర్మించారు. యుద్ధానికి వెళ్లే సమయంలో ఆయన ఇక్కడ సేదతీరారు. యుద్ధంలో గెలిచి వస్తే ఈ ప్రాంతంలో అమ్మవారి ఆలయాన్ని నిర్మిస్తామని మొక్కుకున్నారు. విజయం సాధించిన తరువాత ఇక్కడ మందిరాన్ని కట్టించారని చరిత్రలో పేర్కొనబడింది. అమ్మవారి ఆలయాన్ని ప్రాచీన పద్ధతిలో కట్టించి చుట్టూ కందకం తవ్వించారు. గుడి పక్కనే పెద్ద సొరంగ మార్గం ఉంది. పునరుద్ధరణ పనులు చేపడుతుండగా సొరంగ మార్గం బయటపడింది. భూమిలో పల గదుల్లాంటి నిర్మాణాలు ఉన్నాయి. ఈ ఆలయంలో ప్రతీ పౌర్ణమి రోజు భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. మూడు రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. ప్రతీ సంవత్సరం దేవిశరన్ననవరాత్రి ఉత్సవాలను గ్రామస్తులు పెద్ద ఎత్తున నిర్వహిస్తారు. ఘట్టాలు కూర్చుబెట్టి నిత్యపూజలు నిర్వహిస్తారు. జహీరాబాద్ నుంచి భక్తులు పాదయాత్రన వెళ్లి అమ్మవారిని దర్శించుకుంటారు. చరిత్ర కల్గిన తుల్జాభవాని ఆలయ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని భక్తులు కోరుతున్నారు. దసరా పండగ పురస్కరించుకుని భవాని మాత భక్తులు ప్రతీ సంవత్సరం జహీరాబాద్ నుంచి భవానమ్మపల్లి వరకు పాదయాత్ర నిర్వహిస్తారు. ఈ నెల 10న పాదయాత్ర ప్రారంభంకానుంది.

యోగాతో మానసిక ప్రశాంతత

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



చిన్నారుల యోగాసనాలను తిలకిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: ప్రతీ ఒక్కరి జీవితంలో యోగా భాగస్వామ్యం కావాలని, యోగా మన మనసునే కాదు, శరీరాన్ని కూడా ఆరోగ్యంగా ఉంచుతుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని ముదిరాజ్ భవన్‌లో తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 5వ రాష్ట్రస్థాయి యోగా పోటీలను శుక్రవారం కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల స్థాయి నుంచి యోగాపై శ్రద్ధ పెరిగేలా కృషి చేయాలని కోరారు.

దివ్యాంగుడికి చేయూత

పటాన్‌చెరు: ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. గుమ్మడిదల మండలం దోమడుగుకు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదంలో తన కుటుంబ సభ్యులను సైతం కోల్పోయాడు. తల్లితో కలిసి జీవనం కొనసాగిస్తున్నాడు. ప్రమాదంలో వెన్నుపూసకు గాయం కావడంతో ఉపాధి లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. స్వయం ఉపాధి కల్పించాలని ఇటీవల ఎమ్మెల్యేను కలిసి విజ్ఞప్తి చేయగా.. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే రూ. 3 లక్షల రూపాయలు సొంత నిధులు వెచ్చించి ఆటో కొనుగోలు చేసి అందించారు.

ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి

సదాశివపేట(సంగారెడ్డి):భక్తిభావంతో ప్రజలు దేవిశరన్నవ రాత్రి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని వాసవి కన్యక పరమేశ్వర మందిరంలో ఉన్న అమ్మవారు గాయత్రీదేవి అలంకరణ గావించగా దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే మందిరం కమిటీ అధ్యక్షుడు సాయిరాజ్ శాలువాతో సన్మానించారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగించుకోవాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మహిళలకు సూచించారు. శుక్రవారం పట్టణంలోని 34వ రేషన్ దుకాణం వద్ద మహాలక్ష్మి పథకం లబ్ధిదారులకు సిలిండర్ సబ్సిడీ పత్రాలను ఎమ్మెల్యే చింతా, టీజీఐఐసీ చైర్మన్ తూర్పు నిర్మల హాజరై అందజేశారు.



ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు సన్మానిస్తున్న అలయ కమిటీ సభ్యులు

ఫ్యామిలీ డిజిటల్ కార్డుతోనే సంక్షేమ పథకాలు

జోగిపేట(అందోల్): సంక్షేమ పథకాలు అందరికీ అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డిజిటల్ కార్డులు అందజేస్తోందని ఆర్డీఓ పాండు అన్నారు. శుక్రవారం అందోల్ –జోగిపేట మున్సిపల్ పరిధిలోని 17వ వార్డును పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్డులో ఆరోగ్యపరమైన వివరాలు పొందుపరుస్తున్నట్లు తెలిపారు. డిజిటల్ కార్డును ఎలా వినియోగించుకోవాలి? ఎలాంటి ప్రయోజనాలున్నాయో కమిషనర్ తిరుపతి వార్డు ప్రజలకు వివరించారు.

ప్రజల కోసం ఉద్యమించాలి

- ఎమ్మెల్సీ కోదండరాం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోదండరాం

సంగారెడ్డి ఎడ్యుకేషన్: టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్ తన జీవితమంతా సమాజం కోసం అంకితం చేయడమే కాకుండా ఉపాధ్యాయుడిగా, తెలంగాణ ఉద్యమకారుడిగా అనేక సామాజిక ఉద్యమాల్లో పాల్గొని సామాజిక స్ఫృహను చాటుకున్నారని ఎమ్మెల్సీ కోదండరాం పేర్కొన్నారు. టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో విద్యా సదస్సు, ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అశోక్‌కుమార్ ఉద్యోగ విరమణ అనంతరం కూడా సామాజిక ఉద్యమాల్లో పాల్గొనాలని అన్నారు. ప్రజల కోసం ఉద్యమించడానికి తాను పునరంకితం కావాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మాజీ ఎమ్మెల్సీ ఆర్ సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సన్మానం

మునిపల్లి(అందోల్): మునిపల్లి మండల వ్యవసాయాధికారిగా పనిచేసి బదిలీపై వెళ్లడంతో వ్యవసాయ విస్తరణ అధికారులు, ఆయా గ్రామాల డీలర్లు ఏఓ శివకుమార్‌ను సన్మానించారు. మండలంలోని బుదేరాలో శుక్రవారం ఆత్మీయ అభినంధన సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీఏ సత్యనారాయణ, ఏఓలు లావణ్య, సంగీత, డీలర్లు పాల్గొన్నారు.

◆ నూతన కార్యవర్గం ఎంపిక

మునిపల్లి(అందోల్): ఉపాధి హామీ పథకంలో పనిచేసే ఫీల్డ్ అసిస్టెంట్ల మండల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా ప్రభాకర్, ఉపాధ్యక్షుడిగా ఉల్లాస్, కార్యదర్శిగా సంజీవులు, కోశాధికారిగా కృష్ణను ఎంపిక చేశారు.

◆ బీజేపీ సభ్యత్వ నమోదు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని సాయినగర్ కాలనీలో శుక్రవారం బీజేపీ సభ్యత నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి పాల్గొని మాట్లాడారు. పార్టీని మరింత బలోపేతం చేసి రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చేలా ప్రతీ కార్యకర్త తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

◆ బీజేపీపై నమ్మకం పెరిగింది

కల్హేర్(నారాయణఖేడ్): తెలంగాణలో బీజేపీపై ప్రజల నమ్మకం పెరిగిందని జిల్లా యువ మోర్చా నాయకుడు రాజ్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మసాన్‌పల్లి, మహదేవ్‌పల్లిలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. యువత స్వచ్ఛందంగా బీజేపీలో చేరుతున్నారని తెలిపారు.

◆ స్వయం ఉపాధి మార్గాలు ఎంచుకోవాలి

పటాన్‌చెరు టౌన్: యువత ఉద్యోగం ఒకటే కాకుండా సొంతంగా స్వయం ఉపాధి మార్గాలు ఎంచుకొని ఆదాయం పొందే విధంగా నూతన వ్యాపారాలు ప్రారంభించడం హర్షణీయం అని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. శుక్రవారం గుమ్మడిదల మండలం బొంతపల్లి కామన్ వద్ద దోమడుగు గ్రామానికి చెందిన ఎస్ఎంఆర్ యువసేన సభ్యులు భరత్‌శెట్టి రాఘవేంద్ర భవన్ హోటల్, నాగరాజు నూతన రియల్ ఎస్టేట్ ఆఫీస్‌ను ఏర్పాటుచేయగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. యువత స్వయం ఉపాధి ద్వారా ఆదాయపు మార్గాలు ఎంచుకోవాలని సూచించారు.

అమ్మవారికి పూజలు

చెడు పై మంచి విజయం సాధించడానికి ప్రజలు దేవి నవరాత్రులు నిర్వహించి విజయదశమి జరుపుకుంటారని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. మండలంలోని చిట్కుల్‌లో ఏర్పాటు చేసిన దుర్గామత మండపం వద్ద సతీ సమేతంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

◆ అధికారుల తనిఖీ

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని చీకూర్తి, హుస్సేన్ నగర్ గ్రామాల్లో శుక్రవారం ఎంపీడీఓ రాజశేఖర్ కౌలాస్, ఎంపీఓ సురేష్ పర్యటించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఉదయం ఆయా గ్రామాల్లో పర్యటించిన వారు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పంచాయతీ కార్యాలయాలు తనిఖీ చేశారు. పాఠశాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలపై ఆరాతీశారు.

◆ అంతర్గతదారులను ఆక్రమిస్తే చర్యలు

రాయికోడ్(అందోల్): గ్రామాల్లోని అంతర్గత దారులను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ ఎంఎం.షరీఫ్ హెచ్చరించారు. మండలంలో కొత్తగా పంచాయతీగా ఏర్పడిన ఔరంగానగర్‌లో శుక్రవారం పర్యటించారు. గ్రామంలోని పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. ఆరు వార్డులు ఉండగా పోలింగ్ బూత్‌ల ఏర్పాటు కోసం పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. గ్రామంలోని వివిధ వాడల్లో పరిసరాలను పరిశీలించి అంతర్గత దారులను ఆక్రమించిన వారికి నిబంధనలు వివరించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక పంచాయతీ కార్యదర్శికి సూచించారు.